పోలీసులకు పట్టుబడ్డ అంతర్రాష్ట్ర గంజాయి గ్యాంగ్

అంతర్రాష్ట్ర గంజాయి గ్యాంగ్ అరెస్ట్

41 కిలోల గంజాయి స్వాధీనం

వెంగళరావునగర్, ఫిబ్రవరి 26: అంతర్రాష్ట్ర గంజాయి గ్యాంగ్‌ను పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. మధురానగర్ ఇన్ స్పెక్టర్ జి.శ్రీనివాస్ కథనం ప్రకారం ... ఒడిశా రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా గంజాయి సరఫరాపై పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం రాత్రి వెంగళరావునగర్ నలంద కళాశాల సమీపంలోని బహిరంగ ప్రదేశంలో గుట్టుగా గంజాయిను విక్రయిస్తుండగా హెచ్.ఎన్.ఈ.డబ్ల్యూ. పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ కు చెందిన గంజాయి సరఫరాదారుడు, అంతర్రాష్ట్ర నిందితుడు బాలా హంతల్(24), కూకట్ పల్లికి చెందిన బుర్రా శ్రీనివాసులు అలియాస్ వాసు(24), కూకట్ పల్లికి చెందిన పెద్దర్ గోనుగుంట అభిషేక్(21)లను అరెస్ట్ చేసి వారి నుంచి 41 కిలోల గంజాయి, రూ.40 వేలు నగదు, ప్యాకింగ్ మెటీరియల్, డ్యూక్ బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. చట్ట విరుద్ధంగా జరిగే అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి కఠినంగా వ్యవహరిస్తామని మధురానగర్ ఇన్ స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

లంగర్‌హౌస్ చెరువులో పడి తండ్రీకొడుకు మృతి

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం.. రెండు నిండు ప్రాణాలు బలి

మెహిదీపట్నం, ఫిబ్రవరి 26 : లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగర్ హౌస్ హుడా పార్క్ చెరువును శుభ్రం చేసే క్రమంలో బుధవారం తండ్రీ కొడుకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం... లంగర్ హౌస్ లోని హుడా పార్క్ చెరువులో చెరువును శుభ్రం చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది మహ్మద్ కరీం(38), బుధవారం చెరువులో గుర్రపు డెక్కను తీయడానికి వచ్చాడు. శివరాత్రి సందర్భంగా స్కూల్‌కు సెలవు ఉండటంతో కరీం తన కొడుకు సాహిల్(15)ను తనతో పాటు తీసుకువచ్చాడు. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కరీం తన కొడుకు సాహిల్ తో కలిసి హుడా పార్క్ చెరువులోని గడ్డిని శుభ్రం చేసే క్రమంలో సాహిల్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో అక్కడ బురదలో ఇరుక్కుపోయి తన తండ్రిని సాయం కోరాడు. తండ్రి కూడా వెళ్లి తన కొడుకు చెయ్యి పట్టి బయటకు తీసే క్రమంలో ఇద్దరు నీళ్లలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఇది గమనించిన ఇతర అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమ ఎంటమాలజీ సూపర్‌వైజర్ రమేశ్ కు తెలిపారు.దీంతో అతడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అధికారులపై కార్వాన్ ఎమ్మెల్యే ఆగ్రహం

లోకల్ ఏరియా లీడర్‌లు చెప్పడంతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహిద్దిన్ అక్కడికి చేరుకున్నారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి సమాచారం ఇవ్వడంతో అర్ధగంట వ్యవధిలో డీఆర్ఎఫ్‌టీం ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరు మృతదేహాలని వెలికి తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దిన్ మీడియాతో మాట్లాడుతూ.. గత కొంతకాలం నుంచి మేము జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ ఖైరతాబాద్ తో ఎఫ్‌టీ ఎల్ మెషిన్ గురించి ఎన్నో సార్లు అడగడం జరిగిందని, కమిషనర్ ఏదో సాకు చెప్పి ఎఫ్.టి.ఎల్ మెషిన్ ని మంజూరు చేయలేదని మండిపడ్డారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎటువంటి సేఫ్టీ ప్రికాషన్స్ లేకుండా కనీసం లైఫ్ జాకెట్స్ లు కూడా ఇవ్వకపోవడంతో ఈరోజు దురదృష్టకర సంఘటన జరిగిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే పార్టీ తరపున, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి బాధితుల కుటుంబాలకు సహకారం అందిస్తామన్నారు. ఇది ఇలా ఉండగా.. ఒక బాధ్యత గల ఎంటమాలజీ సూపర్‌వైజర్ రమేశ్ 15 ఏండ్ల అబ్బాయిని ఈ పనిలోకి ఎట్లా పర్మిషన్ ఇస్తారని, ఎమ్మెల్యే దీనికి సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడి సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సేవల చాటున సైబర్ మోసం

సేవా కార్యక్రమాల పేర లింకులు..
ఓపెన్ చేస్తే ఇక అంతే..
అపాత్రదానం వద్దంటున్న పోలీసులు
డబ్బు పోతే జీరో అవర్‌లో
1930కి ఫిర్యాదు చేయాలి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ): సిటీలోని సౌత్‌జోన్‌కు చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు ఇటీవల ఒక లింక్ వచ్చింది. ఆ లింక్ క్లిక్ చేస్తే ప్రారంభనా మందిరానికి తగిన నిధులిస్తామంటూ ప్రకటన ప్రత్యక్షమైంది. అది నిజమని నమ్మిన బాధితుడు మాయగాళ్లతో మాట్లాడి బ్యాంక్ అకౌంట్ వివరాలు పరిశీలించడానికి కొంత డబ్బులు జమ చేయాలని అడగడంతో దశలవారీగా రెండు లక్షల రూపాయలు కొట్టాడు. ఆ తర్వాత వారు స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

– నగరంలోని సెంట్రల్‌జోన్‌కు చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో ఓ ప్రకటన చూశాడు. విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ ఆ పోస్ట్ సారాంశం. తనకు ఉన్న సేవాభావంతో వెంటనే అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు అడిగి తీసుకున్నాడు. ఆ తర్వాత తనకు తెలిసిన వారి దగ్గరి నుంచి విరాళాలు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో వేశాడు. మళ్లీ సంప్రదించే ప్రయత్నం చేస్తే వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు. లోతుగా వెళ్లి ఆరా తీస్తే అది ఫేక్ అని తెలిసేసరికి ఖంగుతిని పోలీసులను ఆశ్రయించాడు.

ఇలాంటి ఒకట్రెండు ఘటనలు మాత్రమే కాదు.. నెలలో సుమారుగా ఐదు నుంచి ఆరు సంఘటనలు ఇలాంటివే జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో సేవా కార్యక్రమాల వైపు యువత మొగ్గు చూపుతున్నది. ఎవరికైనా సహకారం కావాలంటే స్వయంగా రంగంలోకి దిగి సహకరించడమే కాకుండా అవసరమైన నిధులను తమ స్నేహితులు, బంధువుల వద్ద సేకరించి పంపుతున్నారు. ఇది మంచిదే అయినా అపాత్రదానం జరుగుతున్నదని, చేరవలసిన వారికి చేరకుండా సైబర్ నేరగాళ్లకు ఇది ఒక అవకాశంగా మారుతుంది. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతీ అంశాన్ని సొమ్ము చేసుకోవడంలో సైబర్ నేరగాళ్లు సక్సెస్ అవుతున్నారు. ప్రార్థనా మందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్యం చేయిస్తామని, పేద పిల్లలకు ఉచిత విద్య అంటూ ఏదో ఒక సాయం చేయాల్సిన కార్యక్రమాలను ఎంచుకుంటున్నారు. అందుకు తగినట్లుగా ఫొటోలు కూడా డిజైన్ చేస్తారు. ఆ తర్వాత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో పోస్ట్ చేసి విద్యావంతులను అట్రాక్ట్ చేస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని ఆలోచన ఉన్న వారు ఇలాంటి వాటిని నిజమని నమ్ముతున్నారు. తాము చేస్తున్న సాయం సరైన వాళ్లకు చేరుతుందా? లేదా? చెక్ చేసుకునే ప్రయత్నం కూడా చేయకుండా డైరెక్ట్‌గా వారు చెప్పిన అకౌంట్స్‌లోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం ఒక ఎత్తైతే, మీరే విరాళాలు సేకరించి పంపండంటూ వచ్చే లింకులను ఓపెన్ చేసి తమ డబ్బులు పోగొట్టుకుంటున్న వారు ఇంకొందరు ఉన్నారు. ఇలా ఒక్క నెలలోనే సుమారుగా ఏడు నుంచి ఎనిమిది కేసులు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

సేవా కార్యక్రమాలు చేస్తామని..!

విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు, స్వచ్ఛంద సంస్థలు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయంటూ మెసేజ్‌లు పెడుతారు. చాలా మందికి వారి మొబైల్స్‌కు మెసేజ్‌లు, లింకులు పంపుతుంటారు. అవి నిజమని నమ్మించడానికి అవసరమైన వేదికలు కూడా క్రియేట్ చేస్తారు. మొదటగా నమ్మకం కలిగించడానికి రూ.5 నుంచి రూ.10వేలు బాధితుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆ తర్వాత స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాలు, ఇతర లావాదేవీలను తమ ఆధీనంలోకి తీసుకుంటారు. అంతేకాకుండా పెద్ద మొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా ట్యాక్స్ చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. ఇలా మోసపోయామంటూ చాలా మంది విద్యావంతులే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవలు, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బులు పోయిన వెంటనే జీరో అవర్‌లో 1930కి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వివాదానికి దిగిన ప్రయాణికులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

వారణాసికి వెళ్లే విమానం 4 గంటలు ఆలస్యం.. ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: వారణాసి వెళ్లాల్సిన స్పైజెట్ విమానం దాదాపు 4 గంటలు ఆలస్యం కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్తున్న ప్రయాణికులకు స్పైజెట్ ఎయిర్‌లైన్స్ అధికారులు షాక్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వారణాసి వెళ్లాల్సిన విమానం సమయానికి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నదని, ప్రయాణికులు బోడింగ్‌పాసులు తీసుకొని లోపలికి వెళ్లారని చెప్పారు. తర్వాత ఎయిర్‌లైన్స్ సిబ్బంది సాంకేతిక సమస్యతో విమానం ఆలస్యమవుతుందని చావు కబురు చల్లగా చెప్పి వెళ్లిపోయారని ప్రయాణికులు వాపోయారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల పాటు ఎయిర్‌పోర్టులో వేచి చూసిన ప్రయాణికులను ఎయిర్‌లైన్స్ అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని, కనీసం తాగునీరు ఇవ్వడంలేదన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికుల వద్దకు వచ్చి సరైన సమాచారం చెప్పకుండానే వెళ్లిపోయారని, కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్న మాకు తిరిగి వచ్చే విమానం ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. వేలు పెట్టి టికెట్ తీసుకున్న మాకు కనీసం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. ఎయిర్‌లైన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులను ప్రయాణికులు కోరారు. కుంభమేళా చివరి రోజు కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్తున్న ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ అధికారులు నిరాశే మిగిల్చారని పలువురు ప్రయాణికులు విమర్శించారు.

ఎంటేరువాగులో డీసీఎం బోల్తా..

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: డీసీఎం వాహనం అదుపు తప్పి ఎంటేరువాగులో బోల్తాపడిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామ సమీపంలోని డీసీఎం అదుపుతప్పి ఎంటేరువాగులో బోల్తా పడినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ పరిధిలోని కాటేదాన్ నుంచి షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామ పరిధిలో ఉన్న కంపెనీలోకి ప్లాస్టిక్ సామగ్రితో వెళ్తున్న డీసీఎం కాచారం ఎంటేరువాగు సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. పెద్ద శబ్దం రావడంతో వెంటనే అక్కడికి చేరుకొని పరిశీలించగా.. డ్రైవర్ తప్పించుకొని దూకినట్లు తెలిపారు. డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండ్లి చేసుకోవాలంటూ వివాహితపై ఒత్తిడి

ఆపై దాడి.. బంధువులకు బెదిరింపులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: కుటుంబ సమస్యల పరిష్కారంలో సాయం చేస్తానంటూ వివాహితతో పరిచయం పెంచుకొని పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ ఆమెపై దాడి చేసిన ఓ వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని జహీరానగర్‌కు చెందిన మహిళ(28) బ్యూటీషియన్‌గా పనిచేస్తుంది. ఆమెకు పదేళ్ల కిందటే ఓ వ్యక్తితో పెండ్లి కాగా, ఇద్దరు పిల్లలున్నారు. 2018లో భర్తకు విడాకులు ఇచ్చిన ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. కాగా, గత కొంతకాలంగా ఆమెకు కొన్ని సమస్యలు రాగా, వాటిని పరిష్కరిస్తానంటూ ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన చెఫ్ అమీర్‌ఖాన్(25) పరిచయం పెంచుకున్నాడు. కొన్నాళ్ల పాటు వారిద్దరూ సన్నిహితంగానే ఉన్నారు. ఆ తర్వాత గత ఏడాది జూలైలో పెండ్లి చేసుకుంటానంటూ అమీర్‌ఖాన్ ప్రతిపాదించగా.. ఆమె నిరాకరించింది. తనకు పెండ్లి ఇష్టంలేదని, ఉద్యోగం కోసం త్వరలో తాను సౌదీ అరేబియా వెళ్తున్నానంటూ చెప్పింది. అప్పటి నుంచి అమీర్‌ఖాన్ ఆమెపై కక్ష పెంచుకొని.. తనను వదిలిపెట్టి ఎలా సౌదీ వెళ్తావో చూస్తానని వేధింపులకు గురి చేస్తున్నాడు. నాలుగు నెలల కిందట ఆమె ఇంటికి వచ్చి పాస్‌పోర్ట్ లాక్కెళ్లాడు. ఇటీవల అర్ధరాత్రి మరోసారి ఆమె ఇంటికి వచ్చిన అమీర్ బలవంతంగా లోనికి వచ్చి దాడి చేయడంతో పాటు సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె ప్రాణభయంతో కనిపించకుండా వెళ్లింది. దీంతో అతడు ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్లు చేస్తూ ఆమె ఆచూకీ చెప్పకపోతే అంతు చూస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బీఎన్ఎస్ 329(4),115(2),307,351(2), 351(2)(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగ్లాదేశ్ యువతులతో వ్యభిచారం

18మందిని అరెస్ట్ చేసిన నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా యువతులను భారత్‌కు తీసుకురావడమే కాకుండా వారితో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాగుట్టును దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇస్లామ్, మహ్మద్ రోనిఖాన్, జలీల్ సర్దార్, రజత్ మండల్‌లు బంగ్లాదేశ్‌కు చెందిన యువతులు, మైనర్ బాలికలను ఉద్యోగాల పేరుతో అక్రమంగా తీసుకువస్తారు. అనంతరం ముందుగా వారికి వెస్ట్‌బెంగాల్ స్థానికతకు సంబంధించిన ఆధార్ వంటి దృవీకరణ పత్రాలు ఇప్పించి ఆ తరువాత హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలకు తరలిస్తారు. అనంతరం అక్కడ పెద్ద ఎత్తున వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ పోలీసులతో కలిసి రెండు ఠాణాల పరిధిలోని వ్యభిచార గృహాలపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో నిర్వాహకులతో పాటు మొత్తం 18మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో మైనర్లు కూడా ఉన్నారు. ఈ మేరకు నిర్వాహకులను అరెస్టు చేసి, యువతులు, మైనర్లను రెస్క్యూ హోమ్‌కు తరలించారు.

కీసరగుట్టలో బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

చిన్నారిపై అసభ్య ప్రవర్తన..

నిందితుడి అరెస్టు

ఘట్ కేసర్, ఫిబ్రవరి 26: గంజాయి మత్తులో ఓ యువకుడు ఐదేళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించిన సంఘటన ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ పి.పరశురాం తెలిపిన ప్రకారం.. ఘట్ కేసర్ పట్టణంలో నివాసముండే కావటి శ్రీధర్(21) తన ఇంటి సమీపంలో ఉంటున్న బంధువులకు చెందిన ఓ ఐదేళ్ల చిన్నారిని పక్కన ఉన్న చెట్ల పొదలలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడికి చేరుకుని నిందితున్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి డిమాండ్ కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాదీ డాట్ కామ్‌లో పెండ్లి ప్రతిపాదన

యువతితో పరిచయం చేసుకుని డబ్బు కాజేసిన వరుడు
తిరిగి డబ్బు ఇవ్వమంటే మార్ఫింగ్ ఫొటోలు
బయటపెడతానంటూ బ్లాక్‌మెయిల్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26:మ్యాట్రిమోనియల్ సైట్‌లో పెండ్లి ప్రతిపాదనతో వచ్చిన ఓ వ్యక్తి తమ బ్యాంకు ఖాతాలు సీజ్ అయ్యాయంటూ పెండ్లి కూతురిని నమ్మించి రూ.10లక్షలు కాజేయడంతో పాటు ఫొటోలు మార్ఫింగ్ చేసి పరువు తీస్తానంటూ బెదిరింపులకు గురిచేస్తున్న ఘటన జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 78లో నివాసం ఉంటున్న యువతి(31) గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నది. ఇటీవల పెండ్లి సంబంధాల కోసం షాదీ డాట్ కామ్‌లో ప్రకటన ఇవ్వగా.. హర్ష చెరుకూరి అనే యువకుడికి చెందిన వివరాలను నిర్వాహకులు అందజేశారు. యువతి నంబర్‌ను హర్షకు ఇచ్చారు. దీంతో గత నెల 30వ తేదీ నుంచి వారిద్దరూ వాట్సాప్‌లో చాటింగ్ ద్వారా మాట్లాడుకుంటున్నారు. తన తల్లి డా.లక్ష్మి హరిత చికాగోలోని నార్త్ వెస్టర్న్ ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తుందని హర్ష నమ్మించాడు. తమకు పెద్ద ఎత్తున వ్యాపారాలు ఉన్నాయని, ఇటీవల ఐటీ శాఖ దాడులతో బ్యాంక్ అకౌంట్స్ సీజ్ అయ్యాయని చెప్పాడు. త్వరలోనే తల్లి ఇండియాకు వచ్చి పెండ్లి గురించి ఫైనల్ చేస్తుందని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన ఆ యువతి అతడితో మరింత సన్నిహితంగా మాట్లాడటం మొదలుపెట్టింది. ఈ క్రమంలో తనకు చెందిన కొన్ని ఫొటోలు అతడికి పంపించింది. కాగా, ఇటీవల యువతికి ఫోన్ చేసిన హర్ష తనకు అర్జెంట్‌గా కొంత డబ్బు కావాలని, తమ అకౌంట్స్ సీజ్ కావడంతో పాటు పాన్ కార్డును ఐటీ అధికారులు తీసుకువెళ్లారని నమ్మించాడు. దీంతో అతడు సూచించిన నంబర్లకు పలు దఫాలుగా రూ.10.94లక్షలను యువతి పంపించింది. త్వరలోనే డబ్బులు పంపిస్తానని, ఫిబ్రవరి 21న తల్లి అమెరికా నుంచి వచ్చాక నిశ్చితార్థం ఉంటుందని చెప్పాడు. కాగా, ఈనెల 21న తల్లి వస్తుందని చెప్పిన హర్ష ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన ఆ యువతి తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరింది. దీంతో తీవ్ర పదజాలంతో దూషించిన హర్ష అంతుచూస్తానంటూ బెదిరింపులకు దిగాడు. అంతటితో ఆగకుండా తన వద్ద నున్న యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి నగ్న వీడియోలు, ఫొటోలు తయారు చేయించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయిస్తానంటూ బ్లాక్ మెయిల్ చేశాడు. తనకు రూ.10లక్షలు ఇస్తే ఫొటోలు డిలీట్ చేస్తానని, లేకుంటే మార్ఫింగ్ ఫొటోలతో జీవితం నాశనం చేస్తానంటూ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన ఆ యువతి జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పింది. షాదీ డాట్ కామ్ ప్రతినిధులకు ఫిర్యాదు చేసి వాకబు చేయగా.. అక్కడ కూడా తప్పుడు వివరాలు ఇచ్చినట్లు తేలింది. దీంతో ఈ మేరకు బాధితురాలు బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. హర్ష చెరుకూరి అనే వ్యక్తిపై బీఎన్ఎస్ 79, 351(2), 319(2), 318(4)తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెండ్లి పేరుతో మోసం.. కేసు నమోదు

వాట్సాప్‌లో పరిచయం.. వీడియో కాలింగ్‌లో నిఖా

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: మంచి జీవితం ఇస్తానని నమ్మించి వాట్సాప్ వీడియోకాల్స్‌లో నిఖా చేసుకుని వీడియో కాల్‌లో అసభ్యకరంగా ఉన్న వీడియో, ఫొటోలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా తనతో కాపురం చేయకపోవడంతో పాటు వీడియోలు, ఫొటోలు బయటపెడ్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో పాటు మొదటి భార్యతో కలిసి బెదిరింపులకు దిగాడు. పెండ్లి పేరుతో మోసం చేసి వేధింపులకు గురిచేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మొదటి భార్య పైన బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో సౌదీలో ఉంటున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకి సమీపంలోని ఏజీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న మహిళ(36) భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలతో నివాసముంటుంది. ఆమెకు కామన్ ఫ్రెండ్స్ ద్వారా వాట్సాప్‌లో అరేబియాలోని రియాద్ నగరంలో నివాసం ఉంటూ పౌల్ట్రీవ్యాపారం చేస్తున్న మహ్మద్ అబ్దుల్ ఆహద్(39) పరిచయమయ్యాడు. తనది పాతబస్తీలోని మొఘల్‌పుర అని, తన మొదటి భార్యతో విడాకులు తీసుకుని రెండో పెండ్లి కోసం చూస్తున్నానంటూ ఆమెను నమ్మించాడు. పెండ్లి చేసుకున్న తర్వాత ఇల్లు కొనివ్వడంతో పాటు కాపురానికి తీసుకువెళ్తానని చెప్పాడు. దీంతో అతడి మాటలు నమ్మిన ఆమె గత ఏడాది ఏప్రిల్‌లో వాట్సాప్ వీడియో కాల్‌లో టోలీచౌకిలోని ఖాజీ సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. మరుసటిరోజున ఆన్‌లైన్‌లో నిఖా నమోదు చేశారు. ఈ పెండ్లికి సంబంధించిన బాధ్యతలు తన తరపున చూస్తాడని బహదూర్‌పురాకి చెందిన అబ్దుల్ రజా అనే వ్యక్తిని పవర్ ఆఫ్ అటార్నీగా అబ్దుల్ ఆహద్ నియమించాడు.పెండ్లయినప్పటి నుంచి వాట్సాప్‌తో పాటు జంగీ యాప్ ద్వారా మహిళతో వీడియో కాల్స్ మాట్లాడిన ఆహద్ ఆమెతో నగ్న వీడియోలు తీసుకోవడం, కోరిన విధంగా ఫొటోలు తెప్పించుకున్నాడు. త్వరలోనే తాను ఇండియా వచ్చి కాపురానికి తీసుకెళ్తానంటూ నమ్మించాడు. దాంతో అతడు చెప్పినట్లు వీడియో కాల్స్‌లో ప్రవర్తించింది. కాగా నిఖా సందర్భంగా ఆహద్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, పవర్ ఆఫ్ అటార్నీగా ఉన్న వ్యక్తి కూడా ముఖం చాటేశాడు. దీంతో అనుమానం వచ్చి వాకబు చేయగా..అప్పటికే ఆహద్‌కు రెండు పెండ్లీలు అయ్యాయని, మొదటి భార్య అమాతుల్లాతో కలిసి ఉంటున్నాడని తేలింది. మొదటి భార్య అమాతుల్లాకు కాల్ చేయగా.. తన భర్తను వదలిపెట్టాలని, లేకుంటే ఆయనతో చేసిన వీడియో కాల్స్, ఇతర పర్సనల్ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించింది. ఈ విషయం ఆహద్‌కు చెప్పగా.. తాను కూడా సరదాగా పెండ్లి నాటకం ఆడానని సమాధానం ఇచ్చాడు. అతడి గురించి విచారణ చేయగా.. ఇలా పెండ్లి పేరుతో చాలా మందిని మోసం చేసినట్లు తేలింది.దీంతో బాధితురాలు బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్85,318(4), 351(2)తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీలకు పుట్‌పాత్‌లపై అడ్డా..

తాళం వేసిన షెట్టర్లే లక్ష్యం

ఉప్పల్, ఫిబ్రవరి 26 : కిరాణా దుకాణం షట్టర్ తొలగించి అందులో నగదు చోరీ చేసిన నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది . పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ గాంధీనగర్ లోని మార్కెటింగ్ ప్రాంతంలో హోల్‌సేల్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. కిరాణా దుకాణాన్ని గ్యాస్ చంద్ శర్మ, రామ్ కిశోర్ అనే ఇద్దరు షాపు ను 8 ఏండ్ల నుంచి నడిపిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం షాపు మూసివేసి యధావిధిగా ఇంటికి వెళ్లిపోయారు. అయితే ఆదివారం తెల్లవారుజామున షాపు షట్టర్ తొలగించి ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న నిర్వాహకులు వచ్చి చూడగా.. షట్టర్ ఓపెన్ చేసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. దుకాణంలోని రూ.7 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.